క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెన్నై శంకర నేత్రా లయ వారు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మూడో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోగులను పరీక్షించి వారందరినీ ఉచిత బస్సులో తీసుకెళ్లి చికిత్సలు చేసి, తిరిగి ఇక్కడే వదిలిపెడతామన్నారు.

మా మద్దతు వైఎస్సార్‌సీపీకే



కరపత్రం అందజేస్తున్న నాయకులు

పూతలపట్టు: మా మద్దతు వైఎస్సార్ సీపీకేనని యం.బండపల్లి గ్రామస్తులు భరోసానిచ్చారు. మండలంలోని యం.బండపల్లిలో సోమవారం మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి త్యాగరాజు, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామి రెడ్డి, సచివాలయ కన్వీనర్ జ్యోతీశ్వర్, మునిస్వామి, రోజమ్మ, వైస్ సర్పంచ్ జ్యోతి, మార్కెట్ కమిటీ సభ్యుడు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు స్టిక్కర్ అందిస్తున్న నాయకులు

గుడిపాల: ఇంటింటా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మొగరాళ్లపల్లె, పేయనపల్లె, గురుగునత్తం, చలిచీమలపల్లె, గుడిపాలక్రాస్‌లో సోమవారం 'జగనన్నే మా భవిష్యత్ - మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటి యజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రజినీకాంత్, విక్టర్, ప్రకాష్, రఘు, కృష్ణ, సాయితో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు రంజాన్ తోఫా పంపిణీ

చిత్తూరు రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేయనున్నట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ కళాశాల మైదానంలో మంగళవారం సాయంత్రం పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. దీనికి జిల్లాలోని మంత్రులు హాజరు కానున్నారని, 4వేల మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ షాపును మార్చు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఓటివారిపల్లె గ్రామస్తులు

యాదమరి: రేషన్ షాపు మార్పు చేయాలని ఓటివారి పల్లె గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించారు. మా గ్రామానికి షాప్ నెంబర్ 34 చాలా దూరం అవుతుందన్నారు. షాప్ నెంబర్ 37కు మార్పు చేస్తే గ్రామానికి దగ్గరగా ఉంటుందని వారు వివరించారు. దీనిపై పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి గంగ జాతర



చౌడేపల్లె : మండలంలోని చిట్రెడ్డి పల్లె గ్రామంలో మంగళవారం నుంచి రెండురోజులపాటు గంగ జాతర నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం జరిపించనున్నారు. అనంతరం అమ్మవారిని నడివీధిలో కొలువుదీర్చి బుధవారం సాయంత్రం వరకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆధార్ అప్‌డేషన్‌కు అవకాశం

పలమనేరు: ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకొనేందుకు పట్టణంలోని కొత్తపేట, గంటావూరు, రాజీవ్‌నగర్ సచివాలయాల్లో నేటి నుంచి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2010 నుంచి 2016 వరకు ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వకుండా ఆధార్ పొందినవారు విధిగా అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని అందులో స్పష్టం చేశారు. ఇలాంటి వారు ఎవరైనా ఉండి, ఆధార్ అప్‌డేట్ చేసుకోకుంటే ఆధార్‌కు లింకున్న అన్ని సేవలు ఆగిపోతాయని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మట్టి పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయాలి. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలి. ఒక పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుస్తుంది. ఏ ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల అటు భూమికి, ఇటు పంటకు శ్రీరామ రక్షగా నిలుస్తుంది.

- నమూనాల సేకరణలో మారిన విధానం
- భూసార పరీక్ష ఫలితాలతో ఎరువుల ఆదా



మట్టిని వేరు చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు



పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

బంగారుపాళెం: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వాస్తవానికి 90 శాతం రైతులు పంటకు కావలసిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటల సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు తప్ప, దిగుబడులు పెరగడం లేదు. అంతే కాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులకు మెరుగైన దిగుబడులు సాధించేలా జగన్ ప్రభుత్వం ముందుకు పోతోంది. ఇందులో భాగంగానే మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతోపాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయాధికారులు ముందుకు పోతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి, పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందు కోసం జీపీఎస్ (గ్లోబల్ పొజిషినింగ్ సిస్టం) ద్వారా మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ స్థూల పోషకాలతోపాటు పీహెచ్(నైట్రోజన్) సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన జహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

మూడేళ్లకోసారి తప్పనిసరి

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి, నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మట్టి సేకరణలో జాగ్రత్తలు

- పొలంలో ఎరువులు వేసిన తరువాత నెల రోజుల వరకు మట్టి సేకరించకూడదు. అదే విధంగా పంటకు నీరు పెట్టిన తరువాత, నీడ పడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలున్న చోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంటకోత తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలం మొత్తంగా 8–10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగాలను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అర కిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డివేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తరువాత ప్లాస్టిక్ బ్యాగ్‌లో గానీ పాలిథిన్ కవర్‌లో గాని నింపి రైతు వివరాలలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.
- మట్టి సేకరణకు స్థానిక రైతు భరోసా కేంద్ర సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్ద మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు.

భూసార పరీక్షలు ఎంతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు ఉంటాయి. భూసార పరీక్షలు చేసి మండలంలో రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది.

–పద్మజ, మండల వ్యవసాయాధికారి, బంగారుపాళెం

గంగజాతరపై నేడు సమావేశం

చిత్తూరు రూరల్: చిత్తూరు నడి వీధి గంగజాతరపై మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. స్థానిక పొన్నియమ్మ ఆలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వంశపారంపర్య ధర్మకర్తలు సీ.కే.బాబు పాల్గొంటారని చెప్పారు.

అందుబాటులో యూరియా

తవణంపల్లె: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు యూరియా అందబాటులో ఉంచామని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలోని అరగొండ, పల్లెచెరువు రైతు భరోసా కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలించారు. మండలంలోని పల్లెచెరువు, ఎగువ తవణంపల్లె, పట్నం, పుణ్యసముద్రం రైతు భరోసా కేంద్రాల్లో 700 బస్తాల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామని వివరించారు. మిగిలిన ఆర్‌బీకేలకు రెండు మూడు రోజుల్లో యూరియా వస్తుందని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు ద్వారా బయోమెట్రిక్ వేసి ఎరువులను తీసుకోవాలని సూచించారు.

లక్ష్యాన్ని పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రతి వారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కేటాయించిన గృహాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ గౌరి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. మండలంలో చివరి దశలో ఉన్న గృహ నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అభిప్రాయాలను తెలుసుకొని వారికి సలహాలు, సూచనలు అందజేశారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని 39వ డివిజన్ ఎస్సీ కాలనీలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ అముద, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. చిత్తూరు మున్సిపాలిటీ అయ్యాక ఈ డివిజన్‌వాసి భాస్కర్ తొలి చైర్మన్‌గా ఉన్న విషయం గుర్తు చేశారు. చిత్తూరు కార్పొరేషన్ అయ్యాక మూడో మేయర్‌గా ఈ ప్రాంతానికి చెందిన అముద ఉన్నారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే కుటుంబానికి ఏమేరకు మేలు చేకూరిందో లెక్కలతో సహా స్థానికులకు తెలియజేశారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేయర్ అముద మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రామ్‌గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, కార్పొరేటర్లు చల్లా ముత్తు, హరిణిరెడ్డి నాయకులు రమణ, కృష్ణారెడ్డి, షరీఫ్ నాయకులు బుల్లెట్ అప్పు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని గిరింపేటలో ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం లైన్ ట్రిప్ అయింది. దీంతో స్థానికంగా పలు ప్రాంతాల్లో దాదాపు గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే సిబ్బంది వాటిని సరిచేసి, సరఫరాను పునరుద్ధరించారు.

ఆలయ భూమిని కాపాడండి

చిత్తూరు రూరల్: ఆలయ భూమిలో రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ భూమిని కాపాడాలని పాకాల మండలం ఉప్పరపల్లెకు చెందిన సోమసుందర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. ముత్తరపల్లెకు చెందిన దాత శ్రీరామ భజన మందిరానికి 6 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారని చెప్పారు. ఈ భూమిని లాక్కోవడానికి ఇటీవల కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, రోడ్డు పేరుతో తన కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

స్పందన వినతులపై క్షేత్ర స్థాయి విచారణ





అర్జీలు తీసుకుంటున్న చిత్తూరు కమిషనర్ అరుణ, తహసీల్దార్‌కు వినతులు అందజేస్తున్న అర్జీదారులు

చిత్తూరు అర్బన్: స్పందనలో బాధితుల నుంచి వచ్చే వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా.అరుణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె సోమవారం స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా ఇతర శాఖలకు సంబంధించిన వినతులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారించి వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ ఇతర అధికారులు ఉన్నారు.

అర్జీల వెల్లువ

పూతలపట్టు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు వెల్లువెత్తాయని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పందిగుట్టూరు గ్రామస్తులు రోడ్డు ఆక్రమణపై, మరికొంత మంది భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, అర్జీదారులు పాల్గొన్నారు.

చంద్రమౌళి సేవలు చిరస్మరణీయం



చంద్రమౌళికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రమౌళి సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా బస్టాండ్ ప్రాంగణంలో చంద్రమౌళి చిత్ర పటం ఏర్పాటు చేసి, నివాళులర్పించారు. కుప్పం వంద పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, శెట్టిపల్లె వద్ద ఉన్న చెవిటి, మూగ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బసాండు వద్ద..

గుడుపల్లి: విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రమౌళి వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చంద్రమౌళి వర్ధంతి నిర్వహించారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

రామకుప్పం: విశ్రాంత ఐఏఎస్ చంద్రమౌళి వర్ధంతి వేడుకలను రామకుప్పంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వినోదం పంచే పఠనం

- వేసవి సెలవులు సద్వినియోగం
- గ్రంథాలయాలకు కొత్త పుస్తకాల శోభ



గుడిపాల గ్రంథాలయంలో పుస్తక పఠనంలో విద్యార్థులు

గుడిపాల: జగనన్న ప్రభుత్వం కొత్త పుస్తకాలతో గ్రంథాలయాలకు కొత్త కళ తీసుకువచ్చింది. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల ఆదేశాలతో జిల్లాలో రూ.7.16లక్షలతో 2,060 పుస్తకాలను కొనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా చిత్తూరులో ఉన్న ప్రధాన గ్రంథాలయంతో పాటు బాలల, మహిళా గ్రంథాలయాలకు, మండల కేంద్రాల్లో ఉన్న పుస్తక బాండాగారాలకు పుస్తకాలను సరఫరా చేశారు. ఈ పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టి పడేస్తున్నాయి. దీంతో ఉద్యోగాలకు ప్రిపరేషన్ అవుతున్న వారికి పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. సాయంత్రం వేళ సమీప గ్రంథాలయానికి వెళ్లి దాదాపు గంటసేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతోపాటు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఎంసెట్, లాసెట్, విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు ఉన్నాయి.

చాలా బాగున్నాయి



కొత్త పుస్తకాల్లో అడవులు, పక్షులు, జంతువుల మధ్య జరిగే సంభాషణ, పోటీ కథలు ఆసక్తిగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రతి ఆదివారం అందరితో కలసి పాఠాలు, కథలు చదవడం సంతోషంగా ఉంటుంది. మహనీయులకు సంబంధించి చాలా పుస్తకాలు ఉన్నాయి.

– తేజస్విని, 9వ తరగతి

చాలామంది వస్తున్నారు



విద్యార్థులు గ్రంథాలయానికి అధిక సంఖ్యలో వస్తున్నారు. వారికి ఇష్టమైన పుస్తకాలను చదువుకుంటున్నారు. జనరల్ నాలెడ్జ్‌పై ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా పుస్తకాలను కొనుగోలు చేశాం.

– గజేంద్ర, గ్రంథాలయాధికారి, గుడిపాల

గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఐరాల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోనగుంట దళితవాడలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. ప్రతి 15 రోజులకోసారి గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తారని తెలిపారు. వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వడదెబ్బపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

తవణంపల్లె: గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి దాత్రేయచౌదరి తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని పుణ్యసముద్రం సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పుణ్యసముద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను వినియోగించుకోండి

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని కొటాల ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. రోగులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఉచితంగా చికిత్సలు చేసి మందులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.







తవణంపల్లె: పుణ్యసముద్రంలో గర్భవతులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ధాత్రేయచౌదరి, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, యాదమరి: కొటాలలో సేవలందిస్తున్న వైద్యులు

ఉజ్వల భవితకు యువత రాచబాట వేసుకోవాలి



ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో సెలెస్టా

చిత్తూరు కలెక్టరేట్: యువత తమ భవిష్యత్‌కు రాచబాట వేసుకోవాలని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రావూరి వెంకటస్వామి అన్నారు. నగర సరిహద్దులో ఉన్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సెలెస్టా2కే 23 యువజనోత్సవాలు నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో విద్యనభ్యసించాలన్నారు. సినీ సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్ పాల్గొని తన సంగీతంతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో వీసీ రావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.